

ఎస్‌విఎంసి ఎంబీబీఎస్ క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ఎస్‌వి వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం యంబిబిఎస్ నూతన వైద్య విద్యార్థినీ విద్యార్థినులకు ఒరియంటేషన్ క్లాసులను ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ప్రారంభించారు. ఎస్వీఎంసీ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అన్నట్టుగా, తల్లి తండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టుదలతో వైద్య విద్యను అభ్యసించాలి అని విద్యార్థులకు సూచించారు.వైద్య కళాశాలలో బోధనా పద్దతులపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రుయా సూపరిటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు తెలిపారు. ఎస్ వి వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి.పార్థసారథి రెడ్డి, ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు (పరిపాలన) , సునీత సిరిగిరి, (అకాడమిక్), బి ఎస్ ఎన్ మూర్తి, (పరిశోధనలు),పాహిం, సుజాత పాల్గొన్నారు.

ముంపు 'వాన'

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ శ్రీకాళహస్తిలో ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణ

పాఠశాలలకు ముందస్తు సెలవు
జలపాతాల వద్దకు 'నోఎంట్రీ'
అధికార యంత్రాంగం అప్రమత్తం
జిల్లా ప్రజానీకానికి తుపాను హెచ్చరికలు

జిల్లా ప్రజానీకానికి ముందస్తు తుపాను హెచ్చరికలు చేస్తూ అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, అంగన్‌వాడీ స్కూళ్లకు సోమవారం ఉదయమే ముందస్తు సెలవు ప్రకటించింది. మంగళ, బుధవారం కూడా ఈ సెలవు కొనసాగే అవకాశం ఉంది. అయితే అధికారికంగా ప్రకటించలేదు. జిల్లాలో జలపాతాల వద్దకు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లరాదని 'నో ఎంట్రీ' బోర్డులను పెట్టింది. మంగళ, బుధ, గురువారాల్లో వర్షం మరింత ఎక్కువగా ఉండనుంది. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు తుఫాన్ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలో అవసరమైన ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ టీమ్స్ సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమీక్షలో జేసీ శుభం బన్సల్, డిఆర్‌ఒ పెంచలకిషోర్ పాల్గొన్నారు.

తిరుపతి హెల్ప్ లైన్ నంబర్ 0877 2256766

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన కురిసే వర్షాలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా హెల్ప్ లైన్ నంబర్ 0877 2256766 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలను కోరారు. సోమవారం తెల్లవారుజాము నుంచి కమిషనర్ ఎన్.మౌర్య మురుగు కాల్వల్లో పూడిక తీత పనులను చేపట్టారు. పేరూరు చెరువు నుంచి నీరు వచ్చే ప్రాంతాలను, కపిలతీర్థం, మాల్వాడిగుండం నుండి నీరు వెళ్లే ప్రాంతాలను, లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాల్లోని ఇంజినీరింగ్, హెల్త్, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలో ఎక్కడా వర్షపునీరు నిలవకుండా సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మురుగుకాలువల్లో వర్షపునీరు నిలవకుండా, రోడ్లపైకి నీరు రాకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్.ఈ. శివారెడ్డి, అర్బన్ , రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజులు నాయక్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, సి.పి.ఒ. దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు : సిఎండి

తిరుపతి సిటీ : తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చో వద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడంలాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు/ సిబ్బందికిగానీ లేదా టోల్ ఫ్రీ నంబర్లు:1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

సముద్రతీర ప్రాంతాల్లో అప్రమత్తం

కోట : సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట తహశీల్దార్ కటారి జయజయరావు అన్నారు. సోమవారం శ్రీనివాససత్రం, కొత్తపట్నం, రుద్రవరం, ఊనుగుంటపాలెం గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో కలిసి పర్యటించారు. మత్స్యకారులకు అవగాహన కల్పించారు. చేపల వేటకు వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశారు. విఆర్ఒ శ్రీనివాసులు, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, మండల మత్స్యశాఖ అధికారి రెడ్డి నాయక్, మండల సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల : తిరుమలకు వాతావరణశాఖ భారీ వర్ష హెచ్చరిక నేపథ్యంలో ఈనెల 16న బుధవారం శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఇందుకు సంబంధించి 15వ తేది మంగళవారం తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

తుపాన్ పునరావాస కేంద్రాలకు వెళ్లాలి : తహశీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం: అత్యవసర పరిస్థితిలో లోతట్టుప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని దొర వారి సత్రం తాసిల్దార్ శైలకుమారి గిరిజనులకు తెలియజేశారు. తాసిల్దార్ శైలకుమారి ఎంపీడీవో గోవర్ధన్, ఎస్సై అజయ్ కుమార్ సోమవారం మండల పరిధిలోని లోతట్టు మునక ప్రాంతాలను సందర్శించారు. తనియాలి దళిత వాడ, గిరిజన కాలనీ, వేటగిరి పాలెం, బురద మడుగు గ్రామాల్లో నీటి ప్రవాహ ప్రాంతాలను పరిశీలించారు.

కంటైనర్ తొలగించండి

ప్రజాశక్తి -ఏర్పేడు

మండలంలోని ఇసుక తాగేలి చెరువుకు మల్లి మడుగు ప్రాజెక్టు నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు ప్రధాన వరవ కాలువ పై కంటైనర్ ఉంది. రోడ్డు పక్కన గ్యాస్ పైప్ లైన్ పనులు చేపట్టేవారు ఏర్పాటు చేసిన కంటైనర్ వల్ల కాలువ పూడింది. అటు ఆర్ అండ్ బి అధికారులు గానీ ఇటు ఇరిగేషన్ అధికారులు గానీ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. రోడ్డు పక్కన గ్యాస్ పైప్ లైన్ ఏర్పాటు చేసే కంపెనీ అధికారులు స్థానికులు చెబుతున్న వినిపించుకోకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తింది. ఆర్ అండ్ బి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో కషిచేసి ఇరిగేషన్ కాలవపై ఉన్న కంటైనర్ను తొలగించి ఇసుక తాగేలి చెరువుకు వర్షపు నీరు వచ్చేలా చేయాలని ఇసుక తాగేలీ రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని సంతవేలూరు చెరువు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

సంతవేలూరు చెరువు ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోవడం లేదు. 3వేల మంది జనాభాతో అతిపెద్ద మేజర్ పంచాయతి. ఐదువేల హెక్టార్ల ఆనకట్ట కలిగి ఉంది. అయితే పదేళ్లుగా ఈ చెరువు మరమ్మతుకు నోచుకోలేదు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు చెరువు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు నిద్ర, తిండి లేకుండా గడిపారు. ఈ ఏడాదైనా మరమ్మతులు చేస్తారంటే ఎవరూ పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అధికార యంత్రాంగం ముందస్తు తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో చెరువు నిండితే మళ్లీ తెగిపోయే ప్రమాదం లేకపోలేదు. ఈ చెరువు ఆధారం చేసుకుని కువ్వాకొల్లి, సాతంబేడు, కొండూరు, అంబూరు గ్రామాలకు చెందిన రైతులు ఈ చెరువు కిందనే వ్యవసాయం చేసుకుంటున్నారు. సత్వరం మరమ్మతులు చేయని పక్షంలో దాదాపు పదివేల హెక్టార్లు వ్యవసాయం చేసుకునే భూమి ఎడారిగా మారే ప్రమాదం లేకపోలేదు. రైతులు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి.

'ప్రైవేట్'లో విద్యార్థుల భద్రత పట్టదా?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలోని ప్రైవేట్ స్కూల్

ఒకపక్క బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని జిల్లా అధికార యంత్రాంగం ముప్పు ప్రకటించి పెద్ద ఎత్తున ముందస్తు సహాయక చర్యలను చేపడుతోంది. ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు తిరుపతి జిల్లాలో సోమవారం జిల్లా కలెక్టర్ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సెలవు ప్రకటించారు. అయితే శ్రీకాళహస్తి పట్టణంలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు మాత్రం కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ సోమవారం తరగతులు నిర్వహించాయి. దీంతో విద్యార్థులు వర్షంలో తడుస్తూ స్కూళ్లకు వెళ్లాల్సి వచ్చింది. ముప్పు హెచ్చరికల నేపథ్యంలో సైతం ప్రైవేటు స్కూళ్లలో తరగతుల నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భద్రతపై బాధ్యత లేదా అంటూ విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు చుట్టు గురవయ్య, పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు జాకీర్ సోమవారం పలు ప్రయివేట్ స్కూళ్ల వద్దకు వెళ్లి తరగతులు నిర్వహించడంపై అభ్యంతరం తెలిపారు. దీంతో కొన్ని స్కూళ్లలో విద్యార్థులను ఇళ్లకు పంపి వేయగా, పలు పాఠశాలలు మొండిగా తరగతులు నిర్వహించాయి. వీటిపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని నాయకులు ప్రశ్నిస్తున్నారు.

సహాయక చర్యల్లో ఆర్డీఓ

తుఫాను హెచ్చరిక నేపథ్యంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి సోమవారం స్వయంగా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీకాళహస్తి నియోజవర్గం పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఆయా ప్రాంతాలను ఆర్డిఓ గుర్తించి సహాయక చర్యలు చేపట్టారు. వారికి నిత్యావసరాలు సమకూర్చడంతో పాటు భోజన వసతిని కల్పించారు. శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వేడాం ఎస్టీ కాలనీ, భైరవకోన ఎస్టీ కాలనీల్లో ఆర్డీవో పర్యటించి వారికి ముందస్తు జాగ్రత్తలు సూచించారు.

రానున్న తుఫాన్ పట్ల గ్రామాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షులు గాలి మురళి నాయుడు సూచించారు. వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి చెట్ల కింద నిలబడడం, కరెంటు స్తంభాల పక్కన ఉండటం లాంటివి చేస్తే పిడుగుపాటుకు గురై మరణించే ప్రమాదం ఉందని తెలిపారు. వర్షాల కారణంగా ఏ ఇబ్బంది ఎదురైనా హెల్ప్ లైన్లను ఉపయోగించుకోవాలని సూచించారు.

రామచంద్రాపురం మండలంలో సిద్ధమవుతున్న మద్యం దుకాణం

కూటమికే 'కిక్కు'

దరఖాస్తులతో రూ.78.40కోట్ల ఆదాయం
తెల్లారకముందే కిక్కిరిసిన శిల్పారామం
సబ్‌లీజ్‌లు కోట్లల్లోనే బేరసారాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో , తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 11 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 227 మద్యం దుకాణాలకు 3920 మంది ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. కేవలం దరఖాస్తుల ద్వారానే జిల్లా ఎక్సైజ్ శాఖకు 78.40 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించి, రెండో నెంబర్ హాల్లో గూడూరు డివిజన్‌కు సంబంధించిన గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వాకాడ, వెంకటగిరి సంబంధించి తిరుపతి–తిరుచానూరు సమీపంలోని శిల్పారామం వద్ద జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో సోమవారం ఉదయం టెండర్లు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 227 మంది మద్యం షాప్‌లను టెండర్ల ద్వారా దక్కించుకున్నారు. ఇందులో 64 మద్యం దుకాణాలకు ఒక్కో షాపుకు 55 లక్షల లైసెన్సు ఫీజు, 163 మద్యం దుకాణాలు 65 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంది. టెండర్ ప్రక్రియలో పాల్గొనే దరఖాస్తుదారులు ఉదయం 6 గంటలకే శిల్పారామం చేరుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించడంతో వేకువ జామున నాలుగు గంటలకే శిల్పారామం ప్రాంగణంలో హడావిడి ప్రారంభమైంది. వేలాది మంది దరఖాస్తుదారులతో హాలు మొత్తం కిక్కిరిసింది. సరిగ్గా ఉదయం 7గంటల ప్రాంతంలో లాటరీ ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. ఒక్కో షాపుకి మొదట, రెండు, మూడవ ప్రాధాన్యత ప్రకారం లాటరీ నెంబర్లను ఎంపిక చేశారు. మొదట ప్రాధాన్యత గల వ్యక్తులు నిర్ణీత సమయంలో మొదటి విడత లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే రెండో ప్రాధాన్యత వ్యక్తికి లైసెన్సును ఇవ్వనున్నారు. లాటరీ ద్వారా టెండర్లు దక్కించుకున్న వ్యక్తులు ఆనందంతో కేరింతలు కొట్టగా, టెండర్లు కోల్పోయిన వ్యక్తులు బాధతో వెనుతిరిగారు. మరి కొంతమంది ఆశావాహులు టెండర్లు దక్కించుకున్న వారి వద్ద నుంచి సబ్‌లీజ్ తీసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు.

తిరుపతి డివిజన్ పరిధిలో ఓ వ్యక్తి అత్యధికంగా 100 దరఖాస్తులు చేయగా అతనికి కేవలం ఐదు షాపులు మాత్రమే దక్కాయి. మరో వ్యక్తి కేవలం నాలుగు దరఖాస్తు చేయగా ఆ నాలుగు దరఖాస్తులకు టెండర్లు దక్కించుకోవడం గమనార్హం. ఓ ప్రజా ప్రతినిధి అండదండలతో కొంతమంది కూటమిగా ఏర్పడి 318 దరఖాస్తులు చేయగా కేవలం ఏడు షాపులు మాత్రమే దక్కించుకున్నారు. మరో మద్యం వ్యాపారి 60 దరఖాస్తులు చేయగా ఒక్క షాపు మాత్రమే దక్కింది. ఇంకో మద్యం వ్యాపారి తిరపతి అర్బన్ లో 90 దరఖాస్తులు, తిరుపతి రూరల్ లో ఆరు దరఖాస్తులు, శ్రీకాళహస్తిలో నాలుగు దరఖాస్తులు చేయగా తిరుపతిలో రెండు, తిరుపతి రూరల్ లో ఒకటి, శ్రీకాళహస్తి డివిజన్లో ఒకటి దక్కాయి. తిరుపతి చెందిన నలుగురు మిత్రులు కలిసి 36 దరఖాస్తులు చేయగా వారికి ఒకే ఒక్క షాపు దక్కింది. మరో మద్యం వ్యాపారి 35 దరఖాస్తులు చేయగా రెండుసార్లు దక్కించుకున్నారు. కేవలం మద్యం వ్యాపారమే ప్రధాన ఆదయంగా వ్యాపారం చేస్తున్న కొంతమంది వ్యాపారులకు టెండర్లు దక్కకపోవడంతో టెండర్లు దక్కించుకున్న వారి వద్ద సబ్ లీజులు కోసం ప్రాంగణంలోనే పోటీపడ్డారు. ఇది మంచి సమయముగా భావించిన లబ్ధిదారుడు ఒక్కో షాపుకు కోటి రూపాయలు బేరం పెట్టడం కోస మెరుపు.

బ్రాందీషాపు పక్కనే పాకలు

బ్రాందీషాపు పక్కనే పాకలు వెలుస్తున్నాయి. రౌండ్‌రౌండ్ టేబుళ్లు వెలిసాయి. ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకూ షాపులు ఉంటాయని అధికారికంగా ప్రభుత్వం చెప్పింది. లక్కిడిప్‌లో షాపులు దక్కించుకున్నవారు కూల్‌డ్రింక్స్, గ్లాసులు, వాటర్‌బాటిళ్లు, మటన్, చికెన్, ఎగ్ ఆమ్లెట్లు తదితర వస్తువులు పెట్టుకునేవారితో రాయబారాలు కుదుర్చుకుంటున్నారు. షాప్‌కు సైడ్ ఐటమ్స్, షాపు బాడుగ, సిబ్బంది జీతభత్యాలు వీరే చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బ్రాందీషాపు దక్కించుకున్న వ్యక్తికి ఆదాయం తప్ప ఖర్చేమీ లేదన్నమాట. మంగళ, బుధవారాల్లో డాక్యుమెంట్‌రైటర్ల వద్ద అగ్రిమెంట్ కుదుర్చుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే బ్రాందీషాపులు ఎవరెవరికి వస్తాయో ముందే తెలుసుకున్న కూటమి నేతలు తిరుపతి రూరల్‌లో 12 మద్యం షాపులకు గాను రామాపురం, రామచంద్రాపురం, అవిలాల, కాలూరు ప్రాంతాల్లో షెడ్లు వెలిసాయి. అత్యంత పారదర్శకంగా ఓపెన్ టెండర్ల ప్రక్రియ నడిచిందని కలెక్టర్ చెబుతున్నా, అధికార పార్టీ ఎంఎల్ఎల కనుసన్నల్లోనే ఈ ఓపెన్ టెండర్ల ప్రక్రియ నడిచిందని చర్చ నడుస్తోంది.

టిడిపి కూటమి మద్యం షాపుల కేటాయింపుల్లో సిండికేట్ అయ్యింది. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు అనుకూలంగా ఉన్న వైసిపి వారికీ కొన్నిచోట్ల బ్రాందీషాపులు దక్కాయి. దరఖాస్తు చేసుకున్నపుడే ఒప్పందాలు జరిగిపోయాయి. జిల్లాలో 227 మద్యం షాపులకు 3,920 మంది దరఖాస్తు చేసుకున్నారు. 78.40 కోట్లు ఆదాయం ఎక్సైజ్ శాఖకు వచ్చింది. 2014-2019 మధ్యలో అప్పటి చంద్రబాబు హయాంలో మద్యం టెండర్లు పిలవగా ఒక్కో షాపుకు 100-150 వరకూ దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 184 షాపులు ఉండేవి. అప్పట్లో 6,150మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి లెక్కల ప్రకారం లక్ష రూపాయలు డిపాజిట్. ఈ లెక్కన సిండికేట్ అవడం వల్ల ఈ నూతన మద్యం పాలసీలో ఖజానాకు భారీగానే గండిపడిందని చర్చ నడుస్తోంది. ప్రస్తుతం షాపులు దక్కని నిరాశావాహులు సబ్‌లీజ్‌ల కోసం పెద్దఎత్తున ప్రయత్నాలు ముమ్మరం చేయడం గమనార్హం.

పారదర్శకంగా మద్యం టెండర్లు

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జెసి వారి సహకారంతో అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను చక్కగా పూర్తి చేశారన్నారు. మద్యం షాపుల టెండర్ల ద్వారా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖకు సుమారు 78.40 కోట్లు రూపాయల రెవెన్యూ సమకూరిందని తెలిపారు. మద్యం దుకాణాలు ఈనెల 16 నుండి ప్రారంభించాలని, ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మద్యం దుకాణాల లైసెన్స్ 2024 నుండి 2026, సెప్టెంబర్ 30 వరకూ చెల్లుబాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, ఊహా శ్రీ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు వీరివే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఎక్సైజ్ శాఖా డివిజన్ పరిధిలోని 30 మద్యం దుకాణాలకు టెండర్ దారులను సోమవారం ఖరారు చేశారు. ఈ దుకాణాలకు 401 మంది దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతి శిల్పారామం వేదికగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా 30 మంది టెండరుదారులను ఖరారు చేయడం జరిగింది.

శ్రీకాళహస్తి పట్టణం, గ్రామీణం పరిధిలో షాపు నెం.55 నుంచి 66 వరకు జి అంకయ్య, ఎన్ ముని కష్ణయ్య, ఎస్ శ్రీకాంత్ రెడ్డి, కే జయప్రకాష్, ఎమ్మార్ వంశీకష్ణ, ఎన్ సుధాకర్, ఎం.రవి, ఎస్ శ్రీకాంత్ రెడ్డి, జె గురువారెడ్డి, జి హరికష్ణ, వై ప్రసాద్ నాయుడు, వి ప్రసాద్ వరుసగా దక్కించుకున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని షాపు నెం.67 నుంచి 71 వరకు ఎం. జ్ఞానేష్, ఎం పరమేష్, ఎస్ లక్ష్మయ్య, ఎస్ దాశరధి నాయుడు, వి నరేంద్ర బాబు, కేవీబీపురం మండలంలో షాపు నెం. 72 నుంచి 74 వరకు బి యజ్ఞసాయి, నంది అరుణ్, ఎం సురేంద్రబాబు, తొట్టంబేడు మండలంలో షాపు నెం. 75 నుంచి 77 వరకు జి మోహన్ కుమార్, వి ప్రసాద్, కే వాసు నాయుడు, ఏర్పేడు మండలంలో షాపు నెం. 78 నుంచి 84 వరకు టి. రమేష్, డి నాగేశ్వరరావు, పి నాగరాజు నాయుడు, జి సురేష్, జి కిరణ్ కుమార్, ఆర్ రఘుపతి నాయుడు, వై మనోహర్ నాయుడు వరుసగా టెండర్లు దక్కించుకున్న వారిలో ఉన్నారు.

'ముక్కంటి' భక్తులు 'హర్ట్'

దర్శనానికి 'ఆధార్' తప్పనిసరి / అధికారుల ఏకపక్ష నిర్ణయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ముక్కంటి' భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవాలంటే 'ఆధార్' ను తప్పనిసరి చేస్తూ ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర ఆజాద్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శివ శివా ఇదేం పద్ధతి.. ఇదేం సంప్రదాయం.. అంటూ మండిపడుతున్నారు. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎవరు అధికారులుగా వచ్చినా అసంబద్ధ, వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలు చేయడం పరిపాటిగా మారిపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆలయంలో అన్నీ మంచి కార్యక్రమాలు జరుగుతాయని అందరూ భావించారు. అయితే అందుకు విరుద్ధంగా సంప్రదాయం పేరుతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం, సంస్కరణల పేరుతో నిబంధనలు అమలు చేయడంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలను మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుత ఈవో వచ్చీరాగానే సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించాలని నిబంధన పెట్టారు. రాహు–కేతు పూజలకు వెళ్లే భక్తులకూ వాటిని అమలు చేశారు. సిబ్బంది సాంప్రదాయ దుస్తులు ధరించడం ఎప్పటినుంచో ఉంది. అదేవిధంగా భక్తులు కూడా సంప్రదాయ దుస్తులు ధరించి రావాలనే నిబంధన పెట్టడం కూడా సబబే. అయితే అమలుకు కొంత సమయం ఇవ్వాలి. అనుకున్నదే తడవుగా అమలు చేయడం ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలి. ప్రతి ఏటా రాహు కేతు పూజల వల్ల 70 శాతానికి పైగా ఆదాయం ఆలయానికి వస్తోంది. ఈ పూజలకు సంప్రదాయ దుస్తులు ధరించిన వారిని మాత్రమే అనుమతిస్తే ఆదాయం గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంది. అంతేగాకుండా చెడు ప్రచారం జరిగే ప్రమాదం లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, విదేశాల నుంచి కూడా భక్తులు వచ్చి రాహు కేతు పూజలు చేయించుకుంటూ ఉంటారు. వారికి ముందుగా సమాచారం తెలియజేయాలి. అందుకు కొంత సమయాన్ని ఇవ్వాలి. 'ఉరుము ఉరిమినట్లు మెరుపు మెరిసినట్లు' ఆలోచన రావడం, అమలు చేయడం అసలుకే మోసం అనే విషయాన్ని అటు అధికారులు, ఇటు ప్రభుత్వం గుర్తించాలి.

ఇక స్థానిక భక్తులకు ఆధార్ నిబంధన పెట్టడం కూడా సబబు కాదన్న విమర్శలు వస్తున్నాయి. స్థానిక భక్తులు ప్రతి రోజూ స్వామి అమ్మవార్లను దర్శించుకుని దిన చర్య ప్రారంభించే వారు చాలామంది ఉన్నారు. అదేవిధంగా సాయంత్రం వేళ మహిళలు భారీ సంఖ్యలో స్వామి అమ్మవార్ల దర్శనానికి వస్తుంటారు. స్థానికంగా ఉన్న ఆచారాలను కూడా అధికారులు గౌరవించాల్సి ఉంటుంది. నాలుగు గోపురాల నుంచి భక్తులు ఆలయంలోకి వెళుతుంటారు. గోపురాలు వద్ద ఉన్న సిబ్బంది స్థానికులను గుర్తించడం చాలా సులువు. అందరూ పిఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లి ఆధార్ కార్డులు చూపించడం అనేది కష్టమైన పని. పి ఆర్ ఓ కార్యాలయంలో 20 మంది సిబ్బందిని నియమించినా ఆధార్ కార్డులు పరిశీలించి పంపడం అనేది కష్టమవుతుంది. ఆచరణలో అమలు కావడం సాధ్యం కాదు. ఎవరైనా, ఏ అధికారైనా సాఫీగా జరిగిపోవాలని చూడాలి తప్ప, అతిగా వివాదాస్పదంగా ఉండాలని భావించకూడదు. నిర్ణయం తీసుకునే ముందు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలి. గత ప్రభుత్వ పాలనలో ఆలయంలో అనేక అవకతవకలు, అవినీతి, అక్రమాలు, మితిమీరిన జోక్యం చోటుచేసుకున్నాయన్న విమర్శలు ఉన్నాయి.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికార పార్టీ నాయకుల జోక్యం పెరిగింది. అయితే కొందరు నాయకులు కేవలం కొన్నింటిపైనే దృష్టి పెడుతున్నారే తప్ప భక్తుల అవస్థల గురించి పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. స్థానిక ఎమ్మెల్యే భక్తుల మనోభావాలననుసరించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. లేకుంటే ఇబ్బందులు తప్పవని స్థానిక భక్తులు హెచ్చరిస్తున్నారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉద్యాన అధికారిణి యామిని

ప్రజాశక్తి- బుచ్చిరాయుడు కండ్రిగ: వాతావరణ శాఖ సమాచారం మేరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి మూడు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, సోమవారం నుండే వర్షాలు పడడంతో ఉద్యాన రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి మండల ఉద్యాన అధికారిణి యామిని వివరించారు. కూరగాయలు వేసుకున్న రైతులు తోటలలో నీరు నిలువ లేకుండా బయటికి వెళ్లేందుకు సరైన మురుగు కాలువలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తీగ జాతి కూరగాయలు కాకర లాంటి పందిరి వర్గంలో గాలి ఎక్కువగా వస్తే పందిళ్లు పడిపోయే అవకాశం ఉందని, కోతకి వచ్చిన కాయలని కోత కోయడంతో పందిళ్ల పై బరువు తగ్గుతుందన్నారు. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలని సూచించారు.

'దళితుల సాగులో ఉన్న భూమిని దళితులకు పంచాలి'

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కుక్కంబాకం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 81లో ఉన్న భూమిని సాగుచేసుకుంటున్న కుక్కంబాకం పంచాయతీ దళితులకే పంచాలని సిపిఐ మండల కార్యదర్శి ధర్మయ్య ఆధ్వర్యంలో తహశీల్దారుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మయ్య మాట్లాడుతూ కుక్కంబాకం గ్రామానికి చెందిన దళితులు గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అది తెలిసిన కన్నేసిన కొంత మంది పెత్తందారులు ఆ భూమి తమదని ఏవేవో పాత రికార్డులు చూపిస్తూ రెవెన్యూ కార్యాలయానికి దళితులను పిలిపించి వారిని బెదిరించి సర్వేనెంబర్ 81లో భూమి తమదేనని దళితులపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. పెత్తందారులు ఇలాగే ఇబ్బందులు పెడుతుంటే సత్యమని అనే రైతు ఓ సారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. దళితులకు చెందిన భూమిని వారికే ఇవ్వాలని కోరారు. తహశీల్దారు శ్రీనివాసులు ఆ సుబ్రహ్మణ్యం స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత రైతులు గోవిందయ్య కారని, వెంకయ్యస్వామి, జయరామయ్య కారని, సత్యం కారని వెంకటరమణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం కందాడ పంచాయతీ పాస్టర్ ఏ సగేయు ఆధ్వర్యంలో అమెరికన్ లేయర్ ఐ హాస్పిటల్ వారు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సదాశివపురం, శివగిరి కాలనీ, కందాడ, సరస్వతి కండ్రిగ, మునలిపేడు, బత్తినయ్య కాలనీ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ కేశవ ఆధ్వర్యంలో కంటి వైద్యనిపుణులు డాక్టర్ రాజేష్, ప్రియా ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో దాదాపు40 మందికి వైద్య పరీక్షలు చేశారు. బుధవారం 12 మందికి కంటి ఆపరేషన్లు చేసి పంపుతామని వైద్యులు తెలిపారు.

డిగ్రీలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్వి యూనివర్సిటీ సోమవారం విడుదల చేసిన డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాలలో ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థులు పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో అన్ని గ్రూపులలో అగ్ర స్థానాలు కైవసం చేసుకున్నట్లు ఆక్స్‌ఫర్డ్ కళాశాల కరస్పాండెంట్ సి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ బిఎస్సి (ఎంఎస్‌సిఎస్) గ్రూపులో సి సింధు (9.43), జె పోదీశ్వరి (8.20), సి జ్యోతీష్ (8.13), బి.ఎస్సి (ఎంపిసిఎస్) గ్రూపులో ఎస్ నాగలక్ష్మి (8.09), డి సాయి శశిధర్(7.59), టి సుప్రియ (7.25) బి.ఎస్సి(బయో టెక్నాలజీ) గ్రూపులో కె యోగేశ్వరి (8.81), టి ప్రేమ కుమార్ (8.13), కె కల్పన(7.43) పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. బి.కామ్ (సి.ఏ) గ్రూపులో కె హిమ (8.97), ఎస్ కె మోహసీనా (8.91), పీ లలిత కుమారి (8.84) పాయింట్లతో పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సి మధుసూదన్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

28 నుండి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలోని శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 28 నుండి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 27వ తేదీ ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్‌వరణం, సాయంత్రం 6 గంటలకు మత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో ఈ ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. 28వ తేదీ ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్రప్రతిష్ఠ నిర్వహించనున్నారు. 29వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ చేస్తారు. చివరిరోజు అక్టోబరు 30వ తేదీ రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల వీధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ పవిత్రోత్సవాలలో వేదపఠనం, ఆలయశుద్ధి, పుణ్యాహ వచనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టిటిడి అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'పట్టణానికి వెలుపల మద్యం షాపులుండాలి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'పట్టణానికి వెలుపల మద్యం షాపులుండాలని జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పుల్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో మద్యం దుకాణాలు నిర్వహించడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, అక్కడ ఉండే రద్దీ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పుల్ శ్రీకాంత్ అన్నారు. రామసేతు వంతెన సమీపంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణం వద్ద భక్తులు ఆర్టీసీ బస్సుల్లో దిగుతుంటారని అక్కడే అన్న క్యాంటీన్ కూడా నిర్వహిస్తున్నారన్నారు. బస్టాండ్ సమీపంలో రెండు మద్యం దుకాణాలతో పాటు ఓ బార్ అండ్ రెస్టారెంట్ ను నిర్వహిస్తుండడంతో పెద్ద ఎత్తున రద్దీ ఏర్పడుతోందనీ, ఫలితంగా ఏరియా ఆసుపత్రికి, ఆర్టీసీ బస్టాండ్ కు, స్కూలు కాలేజీలకు వెళ్లేందుకు ప్రజలు అపసోపాలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త మద్యం పాలసీలోనైనా మద్యం దుకాణాలలో పట్టణానికి అవతల ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ లోని పలు పోస్టులకు నిర్వహించిన ముఖాముఖి ఎంపికలలో ఎస్వీయూలో ఎంబీఏ కోర్స్ చదువుతున్న 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపల్ నరసయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ మొత్తం 35 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారని, 25 మంది షార్ట్ లిస్టు అయ్యారని, 9 మంది ఎంపికయ్యారన్నారు. ముఖాముఖి ఎంపికలో విద్యార్థి శారీరక, మానసిక దృఢత్వం, భాషా నైపుణ్యాలను, సబ్జెక్టు నైపుణ్యాలను పరిశీలించి ఎంపిక చేస్తారన్నారు. వీటన్నిటిని విద్యార్థులు తరగతి గదిలో అధ్యాపకుల ద్వారా క్షుణ్ణంగా నేర్చుకొని అవగాహన చేసుకొని, ఔపోషణ పట్టాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ కష్టపడి చదివి, నైపుణ్యం కనబరిచిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆచార్య నరసయ్య, అధ్యాపకులు అభినందించారు.

తరతరాలుగా బొమ్మల కొలువు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: దసరా పండుగ ఆధునిక సంస్కృతికి పురుడు పోసుకుని దుర్గమ్మకు పూజలతోనే నేటి యువ భక్తులు సరిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో తరతరాల 'బొమ్మలకొలువు' మరుగున పడి పోతోంది. అయితే తిరుపతి ఖాదీకాలనీకి చెందిన జి.మోహన్‌రావు కుటుంబం తరతరాలుగా 150 ఏళ్లుగా బొమ్మల కొలువు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాదీ దసరా పండుగ సందర్భంగా బొమ్మలను సేకరించి కొలువు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని జి.మోహన్‌రావు, ఆయన సతీమణి ప్రసన్నలక్ష్మి 'ప్రజాశక్తి'కి తెలిపారు. తమ తాతముత్తాల నుంచి ఈ బొమ్మల కొలువు నిర్వహిస్తున్నామని చెప్పారు.

దొంగతనాల జోరు..

- భయాందోళనలో ప్రజలు - అనుమానితుడికి దేహశుద్ధి
- స్పందించని పోలీసులు

అనుమానాస్పద వ్యక్తిని పట్టుకున్న స్థానికులు

దొంగతనానికి ఉపయోగిస్తున్న వాహనం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. పోలీసులు స్పందించకపోవడంతో దొంగతనాలను అరికట్టే నాథుడే కరువయ్యాడు. ఈ నేపథ్యంలో భయాందోళనకు గురవుతున్న ప్రజలు సోమవారం మండలంలో అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి చివరకి విడిచిపెట్టారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి దొంగలను పట్టుకుని దొంగతనాల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏర్పేడు మండలంలో గత కొద్ది రోజులుగా ఏర్పేడు, మేళ్లపాక, కోళ్ల ఫారం రోడ్డు, పుష్పిట్ స్టీల్ కంపెనీ, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిసర ప్రాంతాలలో కొంత మంది వ్యక్తులు ముఠాగా చేరి కొన్ని గ్రామాలలో ఇళ్లల్లో చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటన వెనక కంపెనీల యాజమాన్యం నిర్లక్ష్యం వుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమీపంలోని కార్మికులను తొలగించి బయట రాష్ట్రాల కార్మికులను పిలిపించుకోవడం వల్ల సమీపంలో ఎవరు కార్మికులో.. మరెవరో దుండగులో అర్థం కాని సమస్యలు ఏర్పడుతున్నాయని బాధిత గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో సోమవారం ఉదయం ఏర్పేడు మండలంలోని మేర్లపాక ఎస్‌సి కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని గమనించిన గ్రామస్తులు పట్టుకుని తాడుతో బంధించి దేహశుద్ధి చేశారు. చివరకు విచారించగా పట్టుబడిన వ్యక్తి పేరు చిరంజీవి (37)అని, తిరుపతికి చెందిన వ్యక్తి అని గుర్తించి విడిచిపెట్టారు.

ఈ దుండగులు మొబైల్ చోరీలకు పాల్పడుతూ, ఎదురు తిరిగిన వ్యక్తులపై మారణాయుధాలతో దాడికి పాల్పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వారం రోజుల క్రితం దుండగుల చేతుల్లో ఓ కార్మికుడు శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి సమీపంలో హైవేపై హత్యకు గురి కావడమే ఇందుకు తార్కాణం. సోమవారం అనుమానాస్పద వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి విడిచిపెట్టడం గమనార్హం. దొంగతనాలకు ఉపయోగిస్తున్న టూవీలర్ వాహనం నెంబర్ ఏపీ 40 ఎస్5707 అని స్థానికులు గుర్తించారు. ఈ దొంగల ముఠా వెనక ఇంకా ఎంతమంది ఉన్నారో విచారణ జరిపి పూర్తి సమాచారం తెలిపి దొంగతనాలను అరికట్టాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారని వెంటనే పోలీసులు స్పందించి ప్రజల రక్షణకు భరోసా ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీస్ శాఖ వారు వెంటనే స్పందించి ఈ దొంగల ముఠాను గుట్టురట్టు చేసి కఠినంగా శిక్షించాలని బాధిత గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం న్యూస్

అత్తా మామలపై అల్లుడు దాడి

ఆర్థిక లావాదేవీలే కారణం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అత్త, మామలపై అల్లుడు దాడికి పాల్పడి గాయపరిచిన సంఘటన గూడూరులోని గాంధీనగర్ ఇందిరమ్మ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. గూడూరు టుటౌన్ పోలీసుల కథనం మేరకు గూడూరులోని గాంధీనగర్ ఇందిరమ్మ కాలనీలో కృష్ణయ్య, ధనమ్మలు వుంటున్నారు. వారి కూతురుని వివాహం చేసుకున్న అల్లుడు సుబ్రహ్మణ్యం, అత్తామామల మధ్య ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు తలెత్తాయి. ఈ కారణంగా ఆగ్రహించిన అల్లుడు తన బంధువులతో కలిసి వచ్చి అత్తామామలపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో కృష్ణయ్య, ధనమ్మ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు టుటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -చిల్లకూరు : చిల్లకూరు మండలం పరిధిలో గత సెప్టెంబరు 8వ తేదీ చోటు చేసుకున్న మోటారు వైరు దొంగతనం కేసులో నిందితుడిని చిల్లకూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. జడల వెంకటేశ్వర్లు, మానికల, అంకయ్య మధ్య మోటారు వైరు విక్రయించిన డబ్బుల పంపకంలో తేడాలు వచ్చి ఘర్షణ చోటుచేసుకుందని తెలిపారు. మానికల అంకయ్య, జడల వెంకటేశ్వర్లును వెనుక నుండి గునపంతో తల మీద బలంగా కొట్టడంతో అక్కడికక్కడే కిందపడి మృతి చెందాడు. తర్వాత మృతుడు వెంకటేశ్వర్లును తెలుగు గంగ కాలువ పక్కన గుంత తవ్వి పూడ్చి పెట్టారు. ఈ సంఘటన తిక్కవరం గ్రామం పరిధిలో మామిడి తోటలో జరిగిందని తెలిపారు. రెండు రోజులు వెంకటేశ్వర్లు కనిపించక పోవడంతో అతని బంధువులు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. చిల్లకూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించగా నిందితుడు మాలికల అంకయ్య పరారీ అయిన సంగతి కనుక్కున్నారు. డీఎస్‌పి ఆదేశాల మేరకు నిందితుడిని వెంటనే పట్టుకుని అరెస్టు చేశామని గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు, చిల్లకూరు ఎస్‌ఐ సురేష్ బాబు పేర్కొన్నారు. నిందితుడిని కోర్టుకు అప్పగిస్తున్నామని వారు తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లలో విద్యార్థులందరికీ అవకాశం కల్పించాలి : మాధవకృష్ణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2024 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులో వివిధ కోర్సులలో చేరేందుకు అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా అనివార్య కారణాలవల్ల విద్యార్థులు పిజిసెట్ పరీక్ష రాయని వారికి కూడా అవకాశం కల్పించి స్పాట్ అడ్మిషన్లలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎం మాధవకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తీసుకున్న అనైతిక, అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల్లో ఒకేసారి పీజీ సెట్ ఎంట్రెన్స్ నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు, నిరుపేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. గతంలో ఉన్న ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ఖర్చులు తగ్గించాలని ఉద్దేశంతో అడ్మిషన్ల సంఖ్యను పూర్తిగా తగ్గించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, ప్రస్తుత ప్రభుత్వం అయినా ఉన్నత విద్య అభ్యసించేందుకు నిరుపేద విద్యార్థులకు అవకాశం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతమైన కర్నూలు, కడప, అనంతపూర్, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని విద్యార్థులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను చదివి తమ జీవితానికి ఒక సార్థకత తీసుకురావాలని ఆలోచిస్తారని అన్నారు. ఇటువంటి ఉద్దేశంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యాప్త ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం విద్యార్థులు వచ్చి ఇక్కడ చేరడం ద్వారా ఇక్కడ ఉన్న నిరుపేద విద్యార్థులు ఎస్వీయూలో చదవాలని ఆశ నిరాశగా మిగులుతోందన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఆయా విశ్వవిద్యాలయాలకు పీజీ ప్రవేశ పరీక్షను నిర్వహించే అవకాశం కల్పించి ఉన్నత విద్యలో రాయలసీమ ప్రాంతానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పులివర్తి నానిని కలిసిన కొండారెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలంలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో వర్ష ప్రభావిత ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యలపై పార్టీ కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ రిజిస్ట్రార్ల సంఘం ప్రెసిడెంట్, చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే పేరుతో మామూలు వసూళ్లు చేసేవారని, అమాయక ప్రజలను హింసించి మామూలు పేరుతో వసూలు చేయడం తప్పని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని, తన పేరుతో ఎలాంటి మామూలు వసూళ్లకు పాల్పడకూడదని, తన పేరు చెప్పి ఎవరైనా వచ్చినా, పైరవీలు చేసినా మీ విధులకు లోబడే పని చేయాలని సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డికి తెలిపారు.

ఎమ్మెల్యే నానిని కలిసిన రాష్ట్ర సబ్ రిజిస్ట్రార్ల సంఘం ప్రెసిడెంట్, చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా మైన్స్ ఏడి బాలాజీ నాయక్

చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం, రఘునాథ్ రిసార్ట్స్, టిడిపి కార్యాలయంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని జిల్లా భూగర్భ గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే నానిని కలిసి అభినందిస్తున్న జిల్లా మైన్స్ ఏడి బాలాజీ నాయక్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. 'పల్లె పండుగ పంచాయ తీ'లో భాగంగా పుత్తూరు రూరల్ మండలం తిరుమల కుప్పం పంచాయతీ ఎగువ తిరుమల కుప్పం దళితవాడలో ప్రజల సౌకర్యార్థం రూ.4.20 లక్షల నిధులతో సిసి రోడ్డు, రూ.80 వేలతో డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య, చిత్తూరు పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చినబాబు, రూరల్ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీడీవో రమేష్ బాబు, అధికారులు, మండలం టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

అభివృద్ధి కార్యక్ర శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు టౌన్ : పల్లె పండుగ ద్వారా నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు . గూడూరు మండల పరిధిలోని కొండగుంట గ్రామంలో సిసి డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభోత్సవం చేశారు. మండల పరిధిలోని వెంకటేసు పల్లెల్లో 10 లక్షలు నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మండల పరిధిలోని కొండగుంట గ్రామంలో అరుంధతి వాడలో పది లక్షల రూపాయల నిధులతో సీసీ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని పల్లం, అముడూరు, ఆమందూరు, ఏర్పేడు పంచాయతీలలో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచులు, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కెవిబిపురం: కెవిబిపురం మండలం కాళంగి, ఆదరం, కండ్లూరు, బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీలలో పల్లె పండుగను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపతి బాబు మాట్లాడుతూ, రామాంజులు నాయుడు మాట్లాడుతూ ప్రతి పల్లెని ప్రగతి పథకంలో నడిపిస్తామని తెలిపారు. గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే 2 కోట్లు సిమెంట్ రోడ్లు డ్రైనేజీ వచ్చాయి ఇంకా వస్తాయని తెలిపారు. అనంతరం కాళంగి డ్యామ్‌ను సందర్శించి తుపాను నేపథ్యంలో గట్టి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రాధారాణి, జనసేన అధ్యక్షులు థామస్ పాల్గొన్నారు

బాలకృష్ణ ఆరోపణలు అవాస్తవం: భాస్కర్‌నాయుడు

మాట్లాడుతున్న భాస్కర్‌నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుచానూరు గ్రామ లెక్క దాఖల సర్వే నంబర్ 249/4, 249/5 భూమిలో విషయమై బాలకృష్ణను బ్లాక్ మెయిల్ చేసినట్లు విలేకరుల సమావేశంలో ఆయన చెప్పింది అవాస్తవాలని తిరుపతి నగరానికి చెందిన భాస్కర్ నాయుడు అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుంగ బాలకృష్ణకు సంబంధించిన భూమి ఎకరా 36 సెంట్లులో 8 1/2 సెంట్లు భూమిని 2017 ఆగస్టు 16వ తేదీన 439/2017 రిజిస్టర్ డాక్యుమెంట్ పత్రంతో కోటి 5 లక్షల 95 వేల రూపాయలకు తన భాగస్వామ్యుడు నాగినేని సుబ్రహ్మణ్యం బాబు కలసి కొనుగోలు చేశామన్నారు. ఈ భూ లావాదేవీకి సంబంధించి రెగ్యులర్ రిజిస్ట్రేషన్ చేయించకుండా ఇబ్బందులు పెడుతుంటే హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు వెబ్లాంట్ రికార్డు ను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయాలని రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు. తద్వారా పెండింగ్‌లో ఉన్న రిజిస్టర్ డాక్యుమెంటును రెగ్యులర్ రిజిస్ట్రేషన్ సేల్ డీడ్ నెంబర్ 3382/2019 జూన్ 12వ తేదీన రిజిస్టర్ చేశామన్నారు. అయితే బాలకృష్ణ ఈ భూమి విషయంలో తాము నకిలీ పత్రాలతో బ్లాక్ మెయిల్ చేశామని ఆరోపించడం సరికాదన్నారు.

రూ.10 నాణెంపై అవగాహన

పది రూపాయల నాణెంపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: పది రూపాయల నాణెన్ని ఆమోదంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ పాండురంగ మిఠాయ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పది రూపాయల నాణెం చెల్లుబాటు కాదనేది పుకార్లు మాత్రమేనన్నారు. వీటిని నమ్మవద్దని తెలిపారు. ఈ నాణ్యం చట్టబద్ధంగా రూపొందించబడిందని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ అధికారులు జి ఎన్ మూర్తి, రవీంద్ర కుమార్ అగర్వాల్, నాగరాజరావు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంఎల్‌ఏ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రస్తుత దైనందిన జీవితంలో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపిస్తూ అనేకమంది అనారోగ్యానికి లోనవుతున్నారని, ఆరోగ్యంగా ఉంటేనే మనిషి జీవితం సజావుగా సాగుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఉదయం వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎల్‌ఐసి రోడ్డు సమీపంలోని ఆఫీసర్స్ క్లబ్ లో తిరుపతిలోని15 వాకర్స్ అసోసియేషన్ సభ్యులచే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,ఆరణి సత్యవతి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నడక ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యంగా ప్రతిరోజు వాకింగ్, యోగ, మెడిటేషన్, వ్యాయామం ద్వారా గుండెపోటును అరికట్టవచ్చని సూచించారు. అనంతరం తిరుపతిలోని 15 వాకర్స్ అసోసియేషన్ల అధ్యక్ష కార్యదర్శులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్కాట్ కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తిరుపతిలో ఒక్క క్లబ్ తో ప్రారంభమైన వాకర్స్ అసోసియేషన్ నేడు 15 క్లబ్బులతో అందరికీ స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఇందులో భాగంగానే నేడు 80 సంవత్సరాలు పైబడి నేటికీ నడక సాగిస్తున్న వారిని సన్మానించామనానరు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేరూరు సుధాకర్ రెడ్డి, కోనేటి రవిరాజు, ప్రతాప్, బెల్లంకొండ సురేష్ జనసేన నాయకులు రాజారెడ్డి, పొలకల మల్లికార్జున్ తెలుగుదేశం నాయకులు ఇనుకొండ సుబ్రహ్మణ్యం, మహేష్ యాదవ్, జగన్నాథం పాల్గొన్నారు.

'ఆస్టర్ నారాయణాద్రి' ఆధ్వర్యంలో..

ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు తిరుపతి వాకర్స్ అసోసియేషన్ సమావేశంలో 250 ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ కొత్త ప్రివిలేజ్ కార్డులను ఆవిష్కరించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సిఓఓ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ వాకింగ్‌తో పాటు పీరియాడిక్ ప్రివెంటివ్ హెల్త్ చెక్–అప్స్ చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు అని తెలిపారు. ప్రస్తుతం అన్ని హాస్పిటల్స్ అందిస్తున్న ఆరోగ్య చెక్–అప్స్ తక్కువ ధరలలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని ఉపయోగించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు రు.1999 కె మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ లు పాల్గొన్నారు.

In The Court of the III Addl. District Judge : Nellore
E.P. No. 819/ 2020
ARC No.SSP/SF/151/2017

M/s Sundaram Finance Ltd.,
Having Registered office at No-21, Patullos Road, Chennai-600002, Rep by its authorized person cum **Branch Manager Mr. B.Phaniraju** - Award-Holder

Vs

1.Ms. Moorthy Santhi
2.Mr. Moorthy Kalyan Kumar
3.Mr. Moorthy Narendranath
4.Mr.U.Munaiah - J.Drs

వేలం ప్రకటన

పై నెంబరున అవార్డు హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు 4వ జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే28-10-2024దిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాటపాడుకొనవచ్చును.

E.P SCHEDULE PROPERTY

ITEM NO.I: Nellore District Registration-Sullurpet Sub Registration- Sullurpet Mandal-Nadendlavari Khandriga Village- Survey No- 34/1 for an extent of 0.04 cents of Land is bounded by :- **East :** Land belongs to Mellakanti Polaiah and others in Survey No34/9, **South:** Some Extent of Land in Survey No34/2 Belongs to U.Munaiah and some extent of Land in Survey No.34/8 belongs to K.Mohan,**West :** Land Belongs to G.Kasturi in Survey No.35/3, **North:** Land Belongs to A. Veeraswamy Land In survey NO.33/8.

DHR Value Rs.**10,000/-**
Field Assistant Value Rs.**42,000/-**

ITEM NO.2: Nellore District Registration- Sullurpet Sub Registration- Sullurpet Mandal-Nadendlavari Khandriga Village- Survey No- 34/2 for an extent of 0.04 cents of Land is bounded by:- **East :** Land belongs to K.Mohan in Survey No.34/8, **South :** Land belongs to U.Munaiah in survey No.34/3, **West :** Land Belongs to G.Kasturi in Survey No.35/3 and 35/7, **North:** Land Belongs to U.Munaiah In survey No 34/1.

DHR Value Rs.**10,000/-**
Field Assistant Value Rs.**42,000/-**

ITEM NO.3 : Nellore District Registration- Sullurpet Sub Registration- Sullurpet Mandal-Nadendlavari Khandriga Village- Survey No- 34/3 for an extent of 0.03 cents of Land is bounded by:- **East :** Land belongs to Muchakala Ramanaiah, **South :** Land belongs to M.Ramanaiah in survey No.34/5 and others Land In survey No 34/4, **West :** Land Belongs to G.Kasturi in Survey No.35/7 **North :** Land Belongs to U.Munaiah In survey No 34/2.

DHR Value Rs.**10,000/-**
Field Assistant Value Rs.**29,000/-**

ITEM NO.4 : Nellore District Registration- Sullurpet Sub Registration- Sullurpet Mandal-Nadendlavari Khandriga Village- Survey No- 38/2 for an extent of 0.29 cents of Land is bounded by:- **East :** Some Extent of Land belongs to A.Subbarayadu in survey No38/3 and some extent of land of P.Muthy alayya in survey No.38/4, **South :** Kalamgi River, **West :** Land Belongs to S.Subbaiah in Survey No.38/1, **North :** Land belongs to A.Subbarayadu in survey No39/3

DHR Value Rs.**30,000/-**
Field Assistant Value Rs.**2,87,000/-**

ITEM NO.5: Nellore District Registration- Sullurpet Sub Registration- Sullurpet Mandal-Nadendlavari Khandriga Village- Survey No- 38/6 for an extent of 0.34 cents of Land is bounded by:- **East :** Kalangi River, **South :** Kalangi River, **West :** Land Belongs to M.Chettayya in Survey No.38/5, **North :** Land belongs to K.Srinivasulu in survey No.39/6 and also belongs to P.Subbiah in survey No.39/7

DHR Value Rs.**30,000/-**
Field Assistant Value Rs.**3,02,000/-**

ITEM NO.6: Nellore District Registration- Sullurpet Sub Registration- Sullurpet Mandal-Nadendlavari Khandriga Village- Survey No- 39/4 for an extent of AC.1-00 cents of Land is bounded by:- **East:** Land belongs to U.Munaiah in survey No.38/2 and also belongs to A.Subbramaiah survey No.38/3, **South :** Land belongs to R.Venkaiah in survey No 39/1 and others **West :**Land Belongs to M.Chettayya in Survey No.40/2 and others **North :** Land belongs to K.Srinivasulu in survey No.39/5 and in 39/6.

DHR Value Rs.**1,00,000/-**
Field Assistant Value Rs.**10,00,000/-**

ITEM NO.7 : Nellore District Registration- Sullurpet Sub Registration- Sullurpet Mandal-Nadendlavari Khandriga Village- Survey No- 39/9 for an extent of AC.0-02 cents of Land is bounded by:- **East:** Land belongs to B.Chengaiah in survey No.39/8, **South :** Land belongs to B.Chengaiah in survey No.39/8, **West :** Land Belongs to others, **North :** Land belongs to B.Chengaiah in survey No.39/10.

DHR Value Rs.**10,000/-**
Field Assistant Value Rs.**20,000/-**
Item No's: 1 to 7 Market Value Rs.**8,16,640/-**

వి.జయరామారావు, బి.ఎ., బి.ఎల్.,
డి.ఎస్.వి. రామకృష్ణ కుమార్, బి.కాం., బి.ఎల్.,
అవార్డు హోల్డర్ తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 33/2023
O.S. 177/2022

చల్లా ఇందిరమ్మ ...డి.హెచ్.ఆర్.

VS

1) ఓబులాపురం సుబ్రమణ్యం
2) చల్లా గణేష్
3) చల్లా సుబ్రమణ్యం ...జె.డి.ఆర్.

To.
ఓబులాపురం సుబ్రమణ్యం, తండ్రి సుబ్బయ్య హోంగార్డు, గాజులమండ్యం పోలీసుస్టేషన్ తిరుపతిజిల్లా.

ప్రకటన

పై కోర్టువారు పై కనబరిచిన E.Pలో మీ హాజరు నిమిత్తం పై కోర్టులో తేది.26.11.2024న వాయిదా వేసివున్నారు. ఆ దినము మీరు ఉదయం గం॥10.30ని॥ల నుండి పై కోర్టులో హాజరు కావలెను. అట్లు తప్పిన యెడల E.P మీ పరోక్షములో తీర్మానము చేయబడును.

ఇట్లు
బీరం రామదాసు
బీరం మురళీకృష్ణ
చెన్నూరు బాలసుబ్రమణ్యం,
డిక్రి హోల్డర్ అడ్వకేట్స్
వెంకటగిరి–9440773019

వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 172/2024

శానంపూరి పెంచలయ్య ...వాది

VS

జమ్మళ్ల పోలయ్య ...ప్రతివాది

To.
జమ్మళ్ల పోలయ్య, తండ్రి సిద్దయ్య, బుసపాళెం గ్రామం, వెంకటగిరి మండలం, తిరుపతిజిల్లా.

ప్రకటన

పై కోర్టులో వాది ప్రోనోట్ బాకీ వసూలు నిమిత్తం నీపై దావా వేసివున్నారు. పై దావా మీ హాజరు నిమిత్తం తేది.24.10.2024న వాయిదా వేయబడి వున్నది. ఆ దినము మీరు ఉదయం గం॥10.30ని॥ల నుండి పై కోర్టులో హాజరు కావలెను. అట్లు తప్పిన యెడల దావా మీ పరోక్షములో తీర్మానం చేయబడును.

ఇట్లు
బీరం రామదాసు
బీరం మురళీకృష్ణ
చెన్నూరు బాలసుబ్రమణ్యం
వాది అడ్వకేట్స్
వెంకటగిరి–9440773019